# మళ్ళీ అమరావతి కథలు

సత్యం శంకరమంచి

తలుపు తెరిస్తే భళ్ళున ఇల్లంతా వెలుతురు కమ్ముకున్నట్టు కపిలవస్తు నగరంనిండా వెలుగు. జనం కళ్ళలో వెలుగు. గబ గబ పరుగులు. తోసుకోటాలు. సందడి. అందరి ముఖాల్లో చెరగని చిరునవ్వులు. గుండెలన్నీ ఉయ్యాల లూగుతున్నాయి. సంబరం తెర్లిపోతోంది.

"రాజకుమారుడు తిరిగొస్తున్నాడంట!"

"బుద్ధుడయ్యాడంట!"

"రాజ్యమేలవలసిన రాజు లోకాన్నంతా ఏలుతున్నాడంట!"

"రాజాధిరాజులు కాళ్ళబడి మొక్కులిడుతున్నారంట." గుస గుసలుగా చెప్పుకుంటూ గునగున పరుగులు. పెద్దలు సంబరాలు చూస్తూ పిల్లల చప్పట్లు.

రాజవీథిన కర్పూరోదకం కల్లాపి చల్లారు, ఆడవాళ్ళు రంగు రంగుల ముగ్గులు వలయాలు వలయాలుగా తీరుస్తున్నారు. కాళ్ళ గజ్జెలు ఘల్లు ఘల్లు మనగా జారిపోతున్న కరకంకణాలు పైకి తీసుకుంటూ ముక్కురలు పులుకు పులుకున మెరుస్తుండగా, ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ, ముచ్చట్లు చెప్పుకుంటూ ముగ్గులేస్తున్నారు.

"అంతోసి అందగాడు అడవుల పాలాయెనే!"

"ఓ రోజు రాజు వొంటిన ఎండ సోకితే వారంపాటు వొళ్ళు కందిందట!"

'నవ్వాలిస్తే పట్టు పరుపు దారం గుచ్చుకుందట! పాలమీది మీగడ పొరలో పంచదార పలుకు పంటికి కొంటకమైందట!"

"అంత సుకుమారుడు అడవుల ఏ ఎండకాశ్నో, ఏ వాన తడిసెనో, ఏ ముళ్ళ బాట నడిచెనో, ఏ కసరు కాయ కొరికెనో..." అని వూసులాడుకుంటుంటే కళ్ళ నీళ్ళు రాగా ముక్కులు ఎర్ర బడగా, పదే పదే తుడుచుకుంటుంటే, ముక్కరలోని పుష్యరాగాలు ఎండకు ఎర్రగా మెరిసి, ముక్కులను మరింత ఎర్రగా చేస్తున్నాయి.

బాట నిండా పువ్వులు పరిచారు. మెత్తగా వొత్తి చూశారు. స్వామి పాదాలు ఎక్కడ కసుగందుతాయోనని మరింత వొత్తుగా పువ్వులు పోశారు. అంతః పురంలో యశోధర!

అలనాటి అర్ధరాత్రి నన్ను విడిచివెళ్ళిన స్వామి! ఈనాటి సుప్రభాతాన విచ్చేస్తున్నావా? మాట చెప్పకుండా మాయమయ్యావే! నేవద్దు వస్తానమకున్నావా ప్రభూ! మనసులోని కోరిక సూచనగా అన్నా అన్ని సౌకర్యాలు చేసి పెడుదునే! నేవద్దమైతే నన్నే తొలగించుకుందునే! ఈ రోజు స్వామికి ఎలాగున స్వాగతమివ్వను? అద్దం ముందు అలంకరించుకోబోయింది యశోధర. తల దువ్వుకోబోయింది. తన ముంగురులు సరిదిద్దే స్వామి వెళ్ళిపోయిం తరువాత తిరిగి జడ దువ్వుకోలేదు. తల జడలు కట్టింది. అలాగే ఉండనీ అనుకుంది. చెక్కిలి దిద్దుకోబోయింది. ఆ చెక్కిలికి




పెదవు లతికించి తన్ని తన గుండెలో పొదువుకున్న స్వామి! తన కళ్ళలో కళ్ళు పెట్టి "నీ కళ్ళలోనే ఉదయ సాయం సంధ్యలున్నాయంటూ పవళ్ళూ రాత్రిళ్ళూ తన వొళ్ళో పడుకున్న స్వామి! తన విశాలమైన బాహువులతో ఈ శరీరాన్నందుకుని ఏక శరీరంగా చేసి మసలిన స్వామి! ఇన్ని రోజులకి తిరిగి వస్తున్నాడు. ఎలా అలంకరించను ఈ శరీరాన్ని, ఈ ముంగురుల్ని, ఈ చెక్కిళ్ళని, ఈ పెదవుల్ని, ఈ శరీరాన్ని కాదని, వద్దని వెళ్ళిపోయావుగా స్వామీ? మరి వీటిని అలంకరించను, అలాగే వుండనీ. యశోధర అలంకరించుకోలేదు. అలనాటి అర్ధరాత్రి తన స్వామి తన్ని విడిచిపోయిన రాత్రి కట్టుకున్న పీతాంబరాన్నే తిరిగి కట్టుకుంది.

శుద్ధోదనుడు కళవళ పడుతున్నాడు. నా బిడ్డ తిరిగి వస్తున్నాడు. రాజాధిరాజుల చేత పాదాలు కడిగించుకుని నా కొడుకు తిరిగొస్తున్నాడనుకుంటూ వెండి గడ్డం మెరుస్తుండగా అప్రమితంగా పచార్లు చేస్తున్నాడు. అంతలో మనవడు రాహులుడు తాత దగ్గరకొచ్చాడు. రాహులుణ్ణి గుచ్చి ఎత్తుకుని "మీ నాన్న వస్తున్నాడయ్యా! మన మంతా స్వాగతం చెప్పాలయ్యా! పదయ్యా... పద" అంటూ పొంగుతున్న కన్నీళ్ళు ఆపుకుంటూ ముందుకు నడిచాడు.



మంగళ వాద్యాలు మోగాయి. వీథుల్లో జనం కిక్కిరిసి వున్నారు. అల్లదుగో బుద్ధుడు! అల్లదే వెలుగు! వీథుల నిండా వెన్నెల! అందరి కళ్ళల్లో వెన్నెల! ఆగని కన్నీటి ధారలు! గుబ గుబ లాడే గుండెలు! జలజల రాలుతున్న పూలు! వొళ్ళు పొంగి పోయేట్టు జయధ్వానాలు! బుద్ధుడు అందరివైపు చూశాడు.

జన సముద్రం నిశ్శబ్దమై పోయింది. అందరికీ దిగ్భ్రమ! మైమరపు! రాజకుమారుడు సన్యాసి అయ్యాడు. రత్నకిరీటం లేదు. మణిహారాలు లేవు. కాషాయంబరాలతో, చిరునవ్వు తూపులతో అందరి కళ్ళలోకి చూస్తున్నాడు. ఆకాశంలోంచి కాంతి గోళం భూమిని తాకినట్టుంది. అందరూ నిశ్చేష్టులై చూస్తున్నారు.

స్వామి ముందుకు నడుస్తున్నాడు. పువ్వులు నలిగి పోకుండా నడుస్తున్నాడు. పువ్వులు తమ జన్మ ధన్యమైనట్టు బుద్ధుడి పాదాల కంటుకుని వదలటం లేదు. జనం బుద్ధుని పాదాల మీద పడిపోతున్నారు. కన్నీళ్ళతో కాళ్ళు కడుగుతున్నారు. ఆ చూపు, ఆ నవ్వు, ఆ అభయం! అందరూ ద్రవించి పోతున్నారు.

యశోధర ముందుకు వచ్చింది. తన శిరోజాల్లాగే స్వామి శిరోజాలు కూడా జటలు కట్టాయి. బుద్ధుడు యశోధరని చూసి చిరునవ్వు నవ్వాడు. యశోధరకు మాట రాలేదు. గొంతు విచ్చుకోలేదు. బుద్ధుడి పాదాలు తాకింది యశోధర. ఆ స్పర్శ అతిలోకంగా తోచింది.

ముందుకు వస్తున్న బుద్ధుడికి తండ్రి శుద్ధోదనుడు అన్నాడు. "అయ్యా! నువ్వు నా కొడుకువి. నేను నీకు తండ్రిని. నువ్వు లోకానికి తండ్రివయ్యావు. లోకాలకు తండ్రివయిన నీకు నీ తండ్రి ఏ మిచ్చుకో గలదు? నీ కొడుకునే నీకు కానుకగా ఇచ్చుకుంటాను" అంటూ రాహులుణ్ణి బుద్ధుడికి అర్పించాడు. ఆ దృశ్యాన్ని పాలరాతిలో పలికించి మన కందించాడు అమరావతి శిల్పి.